క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



చిన్నారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందజేస్తున్న దృశ్యం

భీమవరం : అగ్ని ప్రమాదంలో గాయబడిన భీమవరం మండలం బేతపూడి గ్రామానికి చెందిన 10 ఏళ్ల చిన్నారికి అక్షయ హెల్పింగ్ హాండ్స్ ద్వారా రూ. 50,050 ఆర్థిక సహకారాన్ని సభ్యులు అందజేశారు. బేతపూడికు చెందిన ఏలేటి ఏసోబు, నాగమణి దంపతుల కుమార్తె స్వరూప 20 రోజుల క్రితం అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయబడింది. అక్షయ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు దాతలను సేకరించి వచ్చిన రూ.50,050లను భీమవరం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి స్వరూప తల్లిదండ్రులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్షయ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు సుంకర సతీష్, కట్టా నరసింహ స్వామి, గొడి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

250 మందికి ఉచిత వైద్య సేవలు



ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం గ్రామ పంచాయతీ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుల సహకాంతో చినపేట లూథరన్ చర్చ్ ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సెయింట్ మేరీస్ హాస్పిటల్, భీమవరం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మెగా వైద్య శిబిరంలో 250మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగం సూరిబాబు, ఉప సర్పంచ్ ఆనంద్ రాజు, డాక్టర్స్ గ్రాజియా లోబో, సిమిలీ, సింధూ, అనిత, కోరుకొల్లు శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



భీమవరం ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

భీమవరం(ప్రకాశం చౌక్): కార్మికులపై అధికారుల వైఖరి దారుణంగా ఉందని నేషనల్ మజ్దూర్ యూనియన్ జోనల్ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు విమర్శించారు. గ్యారేజీ మెకానిక్ సస్పెన్షన్‌ను ఖండిస్తూ డిపో సమీపాన ఆదివారం నిర్వహించిన రిలే దీక్షలు నాలుగోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బాధ్యులైన అధికారులను వదిలేసి, సర్కులర్‌కు విరుద్ధంగా యూవీరావును సస్పెండ్ చేశారన్నారు. ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి వై.వి.రావు, రాష్ట్ర యూనియన్ కార్యదర్శి పి.సోమరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం



పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవ దృశ్యం

భీమవరం : పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.వీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై యూనియన్ చేసిన కృషిని వివరించారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐఆర్‌ను వెంటనే ప్రకటించి, రాబోయే ఉపాధ్యాయ బదిలీల్లో విద్యా సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నాయకులు సీహెచ్ ఈశ్వరరావు, టి.గణపతి, కె.రామాంజనేయులు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని భీమవరం బాలుర బీసీ హాస్టల్ వార్డెన్ కడలి శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ఆదివానం అవగాహన ర్యాలీ నిర్వహించి దాతల సహకారంతో హాస్టల్‌కు స్టీల్ గ్లాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని అందరూ సమష్టిగా సహకరించాలన్నారు. స్థానిక పోలీస్ బొమ్మ సెంటర్ నుంచి ప్రకాశం చౌక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు రోడ్డెక్కేదెప్పుడు ?

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం నుంచి రాని స్పష్టత



వీరవాసరం ఆర్టీసీ బస్టాండ్‌లో నిలుపుదల చేసిన బస్సులు

వీరవాసరం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు, ప్రతి నెల మహిళలకు రూ.1,500, యువతకు నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు అంటూ సూపర్ సిక్స్ హామీలు గుప్పించారు. టీడీపీ, కూటమి నేతలు, సీఎం కుర్చీనెక్కిన చంద్రబాబు నాయుడు తూతూమంత్రంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం అంటూ రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి ప్రకటించగా..ఇంకో అమాత్యుడు నారా లోకేష్ రోడ్ మ్యాప్ వేద్దాం..వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిద్దామని చెబుతున్నారు. హామీలు చూస్తుంటే భయమేస్తుందని ఏకంగా సీఎం చంద్రబాబు చెప్పడంపై అన్ని వర్గాల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఉచిత ప్రయాణం లేనట్టేనా? అని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఓట్లేసి మోసపోయామంటూ గగ్గోలు

టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోల్లో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికల ముందు మహిళలు ఎక్కడైనా ఉచితం ప్రయాణం చేయొచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. టీడీపీ కూటమి నేతలు గద్దెనెక్కి 7నెలలు గడుస్తున్నా హామీలను పట్టించుకోవడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం ఇంకెప్పుడు అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రల్లోని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేశాయి. తమిళనాడు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచో అమలులో ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూడా అదే ఫార్ములాను అమలు చేసింది. ఉచిత బస్సు అంటూ జోరుగా ప్రచారం చేపట్టింది. అయితే ఉచిత బస్సు హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణమని ప్రజలను మభ్యపెట్టారని స్పష్టం కావడంతో మహిళలు ఉసూరుమంటున్నారు.

స్పష్టత లేదు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు కనీసం స్పష్టత ఇవ్వడం లేదు. రోడుడ రవాణశాఖ మంత్రి మాత్రం త్వరలోనే అని చెప్పడం తప్ప.. ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. తొలుత గత ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అని అన్నారు. మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని వదంతులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికితోడు ఏకంగా చంద్రబాబు సైతం సూపర్ సిక్స్ హామీలయితే ఇచ్చాము. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూర్చింది.

మహిళా ఓటర్లను ఆకర్షించేందుకే హామీ...

భీమవరం నియోజకవర్గంలో దాదాపు 3లక్షల మంది పైగా జనాభా ఉన్నారు. అందులో 18ఏళ్లు పైబడిన మహిళలు 1,25,810 మంది ఉన్నారు. వీరవాసరం మండలంలో 25,747 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. రోజూ సగటున 40శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీంతో మహిళ ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని హామీ ఇచ్చారు. తీరా గెలిచాకా హామీలను పట్టించుకోవడం మరిచిపోయారు.

హామీలన్నీ అమలు చేయాలి

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అన్ని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఎప్పుడూ అమలు చేస్తారో కూడా తెలియడం లేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వం అమలు చేసింది కదా? ఇక్కడ ఎందుకు అమలు చేయలేకపోతున్నారు. ఈ పద్ధతి బాగా లేదు. హామీలు అమలు చేయకపోతే వెంటనే రాజీనామా చేయాలి

– కె సత్యవతి, వీరవాసరం

హామీ ఇచ్చేటప్పుడు భయం కనిపించదా?

ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చేటప్పుడు ఆచరణకు సాధ్యమా, అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంలో కూర్చుని ఇప్పుడు హామీలు చేస్తుంటే భయమేస్తుంది అని చెప్పడం సిగ్గుచేటు. హామీలు ఇచ్చేటప్పుడు చంద్రబాబుకు భయం కనిపించలేదు. టీడీపీకి ఓటు వేసి మహిళలు మోసపోయారు.

– పి మహాలక్ష్మి, నవుదూరు, వీరవాసరం మండలం

నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ఆరోగ్య సిబ్బందికి నులిపురుగు మాత్రలు అందజేస్తున్న సీహెచ్‌వో దేవదాసు

వీరవాసరం: జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ సెంటర్లలో అమలు జరిపి విజయవంతం చేయాలని సీహెచ్‌వో దేవదాసు కోరారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బందికి ఆల్‌బెండజోల్ మాత్రలు అందజేశారు. నేటి నుంచి నుంచి 17వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ల వయస్సు పిల్లలకు ఈ మాత్రలు ఆరోగ్యశాఖ అధికారులు సూచించిన విధంగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కోర్టు భవనాల సముదాయంలో మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని సివిల్ కేసులు, రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్, చెక్కుబౌన్స్, వాహన ప్రమాద బీమా కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని, కేసుల నుంచి విముక్తి కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి ఉత్సవాలు



పెదపుల్లేరు సత్తెమ్మ అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్

ఉండి: మండలంలోని పెదపుల్లేరు గ్రామంలో సత్తెమ్మ అమ్మవారి 60వ వార్షిక జాతర మహోత్సవాల్లో రెండవ రోజు ఆదివారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతర నిర్వాహకులు, ఆలయ పెద్దలు పీవీఎల్‌ను అమ్మవారి ప్రతిమతో కూడిన జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పంచామృతాలతో నిండిన 108 కలశాలతో గ్రామానికి చెందిన ఆడపడుచులు అంగరంగ వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని తెలిపారు. మాయమాటలు నమ్మిన ప్రజలంతా మోసపోయారని వారిని భగవంతుడే కాపాడాలని కోరుకున్నట్లు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లప్పుడూ సంక్షేమాన్నే కోరుకున్నారని కానీ ఇప్పుడు వారికి ప్రజలకు సంక్షేమం కరువైందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలంతా కళకళలాడేవారని అన్నారు. కానీ ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఎక్కువ ఇస్తామని నమ్మబలికి అధికారంలోకి రాగానే మొండిచేయి చూపించారని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జాతర నిర్వాహకులు, ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని పంచారామ క్షేత్రం ఉమాసోమేశ్వరజనార్ధన స్వామి వారి దేవస్థానంలో కొలువైన సూర్యనారాయణ స్వామికి మాఘమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు కొమ్ము శ్రీను ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అధిక భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధులకు ఉచిత వైద్యసేవలు

తణుకు అర్బన్: అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన వృద్ధులకు తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యసేవలు అందజేశారు. తణుకు, ఇరగవరం, ఉండ్రాజవరం ప్రాంతాల్లో సంచార వాహనం ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తమ వైద్యసిబ్బందితో కలిసి ఇంటికే పరిమితమైన 20 మంది వృద్ధులకు వైద్యసేవలు అందజేశారు. సంఘ కార్యదర్శి ఎండీ స్వాలిహా ఆర్థికసాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పద్మశ్రీ డాక్టర్ ఏంఆర్‌రాజు, మంతెన రామ్‌కుమార్‌రాజు

భీమవరం(ప్రకాశం చౌక్): జువ్వలపాలెంలో ఉన్న డీజేఆర్ సత్రం అనుబంధ పద్మావతీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు యామిజాల ఉమాసోమేశ్వర శర్మ, వేలూరి శ్రీనివాస్, ఎస్. ధనలక్ష్మి, జి.రేవతిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ భగవద్గీత కంఠస్థ పోటీలను 3 విభాగాల్లో నిర్వహించి మొదటి బహుమతికి రూ.మూడు వేలు, ద్వితీయ బహుమతికి రూ.2వేలు, తృతీయ బహుమతికి రూ.వెయ్యిలు చొప్పున విజేతలకు పద్మశ్రీ డాక్టర్ ఏంఆర్ రాజు, సత్రం వంశపారంపర్య ధర్మకర్త మంతెనరామకుమార్ రాజు, దంతులూరి రంగరాజు, ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేతలైన గన్నాబత్తుల ఓజస్విని, మండూరి రిషీ జ్యోతి, కందుల లీల, కందుల రమ్య, మునగాల విజయ, తుమ్మలపెంట వెంకటలక్ష్మిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు 38 గ్రాముల బంగారం సమర్పణ



మావుళ్లమ్మ అమ్మవారికి బంగారాన్ని ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదగా అందజేస్తున్న దాతలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి ఆదివారం దాతలు రూ.3 లక్షల విలువగల 38 గ్రాముల బంగారాన్ని అందజేశారు. అత్తిలికి చెందిన వానపల్లి గంగరాజు ప్రకాష్, సీతా మహాలక్ష్మీ దంపతులు 30 గ్రాములు, కలవపూడికి చెందిన ఎం. చిన వెంకటరాజు, సూర్యకాంతం 4 గ్రాములు, పి దుర్గ ప్రసాదరాజు, శ్రీదేవి 4 గ్రాములు బంగారాన్ని అమ్మవారికి విరాళంగా అందజేశారు. దాతలు ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదగా బంగారాన్ని ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహలక్ష్మినగేష్‌కు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

భద్రత కరువు !

- ఏటీఎం వద్ద కనిపించని సెక్యూరిటీ గార్డులు
- తరచూ సాంకేతిక సమస్యలతో తిప్పలు



శృంగవృక్షంలో ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్



శృంగవృక్షంలో యూనియన్ బ్యాంక్ ఏటీఎం

పాలకోడేరు: వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు పట్టణ, గ్రామాల్లో బ్యాంకులు పోటాపోటీగా ఏటీఎం కేంద్రాలు ఏర్పాటు చేశాయి. కానీ వాటి నిర్వహణను మాత్రం గాలికి వదిలేస్తున్నాయి. ఉండి నియోజకవర్గంలోని ఏటీఎంల నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. నియోజకవర్గంలోని పాలకొడేరు 5, ఆకివీడు 8, ఉండి 6, కాళ్ల 5 ఏటీఎం కేంద్రాలు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. బ్యాంకు అధికారులు ఏర్పాటు చేసిన ఏటీఎంలలో నిత్యం లక్షల రూపాయలు డ్రా చేస్తంటారు. కేంద్రాల వద్ద గతంలో 24గంటల పాటు భద్రత నిర్వహిస్తూ సెక్యూరిటీ గార్డులు కనిపించేవారు. కానీ నేడు మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. మిషన్‌లలో డబ్బులు ఏర్పాటు చేసి ఆ తర్వాత వాటి భద్రతను గాలికి వదిలేస్తున్నారని, కనీసం వాటిని పట్టించుకున్న దాఖలాలు కన్పించడం లేదని, పలువురు అంటున్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద భద్రత కల్పించాల్సిన బాధ్యత సంబంధిత బ్యాంకులపైన ఉంది. భద్రత ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు హితవు పలుకుతున్నారు.

సాంకేతిక సమస్యలతో సతమతం

తరుచూ ఏటీఎం కేంద్రాల్లో మిషన్లు సాంకేతిక సమస్యలతో వినియోగదారులు సతమతమవుతున్నారు. డబ్బులు డ్రా చేయాలన్నా..డబ్బులు అకౌంట్‌లో వేయాలన్నా...సంబంధిత మిషన్ పని చేయదు. వరుసగా నాలుగు రోజులు పాటు బ్యాంకులకు సెలవులు వస్తే మొదటి రెండు రోజులు అందుబాటులో ఉంటాయి. మిగిలిన రెండు రోజులు మాత్రం పనిచేయడం కష్టం. లేదంటే మిషన్‌లో బ్యాలెన్స్ నిల్ సమాచారం ఉంటుంది. సంబంధిత అధికారులు ఏటీఎం కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడంతో పాటు వాటి పనితీరును సక్రమంగా ఉండేలా చూడాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

తణుకు అర్బన్: తణుకు మండలంలోని రైతులంతా త్వరితగతిన రైతు రిజిస్ట్రేషన్ ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని తణుకు మండల వ్యవసాయాధికారిణి కె.కుసుమ అన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు అన్నింటికీ రాయితీలు, డబ్బులు రైతులకు జమ కావాలన్నా రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ తదితర ఏ స్కీములో అర్హత కావాలన్నా ఏపీఎఫ్ఆర్‌లో నమోదు కావాల్సిందేనని అన్నారు. దువ్వ, మండపాక కేంద్రాలకు వచ్చిన రైతులకు రైతు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పొలం 1బీ, ఆధార్, ఆధార్‌కి లింక్ అయిన మొబైల్ నంబరు తీసుకుని రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

రైతులకు యూనిక్ ఐడీ

పెంటపాడు: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ (డిజిటలైజేషన్) చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) కేటాయిస్తుందని మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డ్ తరహాలోనే రైతులకు ప్రత్యేకంగా ఈ కార్డు ఇస్తారని ఆమె తెలిపారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి రాయితీ, ఎరువుల రాయితీ, పంటల బీమా పలు రకాల వ్యవసాయ అనుబంధ సేవలు పొందాలంటే తప్పనిసరిగా ఈ కార్డు తీసుకోవాలని ఆయన తెలిపారు.

కొల్లేరు తీరంలో కొలువైన రామలింగేశ్వరుడు



ఆకివీడు: సిద్ధాపురంలో శరవేగంగా పునర్నిర్మాణం జరుగుతున్న రామలింగేశ్వర స్వామి ఆలయం



ప్రతిష్టకు సిద్ధం చేసిన విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం

- 400 ఏళ్ల నాటి బ్రహ్మసూత్రం కలిగిన శివలింగం
- ప్రారంభోత్సవానికి ముస్తాబైన ఆలయం
- ప్రారంభమైన ప్రతిష్ఠ మహోత్సవాలు

ఆకివీడు: కొల్లేరు సరస్సు తీరంలో మరో విశిష్ట దేవాలయం బయల్పడింది. గ్రామంలోని మంచినీటి చెరువు తవ్వుతుండగా బయటపడిన బ్రహ్మసూత్రం కలిగిన మహా శివలింగంను అనాధిగా పూరిగుడెసెలో ఉంచి పూజలు చేస్తున్నారు. గ్రామస్తులు, భక్తులు, దాతల సహకారంతో శ్రీపర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం నిర్మాణం రూపుదిదుకుంటుంది. 400 ఏళ్ల చరిత్ర కలిగిన శివలింగంను తెలుగు రాజులు కొల్లేరు తీరంలో ప్రతిష్ఠించారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. సిద్ధులు, యోగులు తపస్సు చేయగా సిద్ధి పొందిన సిద్ధాపురం గ్రామంలో కోదండ రాముడు కూడా ఆ విధంగానే వెలిశారు. నాలుగు దశాబ్దాల క్రితం గ్రామంలో కోదండ రామాలయంను కంచి కామ కోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా ప్రతిష్ఠించారు. పీఠాధిపతుల ఆశీస్సులతో సుబ్బయ్య స్థపతి, స్వామి నాథన్ స్థపతి(శివ) కాంచీపరంల సహకారంతో ఆలయ నిర్మాణం రూపుదిద్దుకుంది.

వైభవంగా ప్రతిష్ఠ కార్యక్రమాలు

పార్వతీ వర్ధని సమేత రామలింగేశ్వర స్వామి వార్ల విగ్రహాలతో పాటు గణపతి, శివుడు, అమ్మవారు, నంది, ధ్వజము, బలి పీఠము, చండీశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీకృష్ణ అయ్యప్ప, కనకదుర్గ, కాల భైరవుడు, నవ గ్రహాలు, నాగ బంధము విగ్రహాలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. యాగ శాలలో హోమం ప్రారంభించారు. విగ్రహాలను గ్రామంలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. గ్రామ పెద్దలు భూపతిరాజు తిమ్మరాజు, అల్లూరి సోమరాజు, రంగరాజు, సిద్ధయ్యరాజు, మల్లిరాజు, కృష్ణంరాజు, వసుపులేటి శివనాగబాబు, జల్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.